# గొర్రెల కాపరులు.. మిర్చి రైతులు.. కూలీలు

**ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే:** మిరప కల్లాల్లో కాయలు ఆరబెట్టుకుని ఉన్న రైతుల వద్దకు వెళ్లి వారి కష్టాలు తెలుసుకోవడం. గొర్రెల కాపరుల భుజాన చేయి వేసి వారి బాగోగుల గురించి ఆరా తీయడం. చంద్రబాబు మీకోసం పర్యటనలో ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కూలి పని చేసుకుంటూ కాసేపు చెట్టు కింద కూర్చుని సేద తీరుతోన్న మహిళలతో మాట్లాడటం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఖమ్మం అర్బన్ మండలంలోని రఘునాథపాలెం, కోయచెలక, కోటపాడు, చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో మంగళవారం మీకోసం చైతన్యయాత్ర సాగింది.

## బెంగవద్దు.. ఒత్తిడి తెస్తాం...

కోయచెలక గ్రామంలోకి చంద్రబాబు కాన్వాయ్ ప్రవేశిస్తోన్న సమయంలో ఊరి బయట కనిపించిన మిరప కల్లాల్లోకి వెళ్లి రైతు మున్నా చినవెంకయ్యతో మాట్లాడారు. మిరపసాగులో ఎదుర్కొన్న సాదకబాధలను అడిగి తెలుసుకున్నారు. 'ఎన్ని ఎకరాల్లో మిరప వేశావు.. ఎంత దిగుబడి వచ్చింది..' అని చంద్రబాబు రైతును ప్రశ్నించారు. మూడెకరాల్లో పంట వేస్తే ఒక్కో ఎకరాకు రూ.40వేల వరకు ఖర్చయిందని.. కష్టపడినా ఫలితం దక్కిందనుకున్న సమయంలో అకాలవర్షం నిండా ముంచిందని ఆ రైతు బాబుతో మొరపెట్టుకున్నాడు. ఇప్పుడు రంగుమారిన మిరప అమ్మబోతే మొత్తం పంటకు రూ.30 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదని చెప్పాడు. దీంతో స్పందించిన చంద్రబాబు బెంగ పడవద్దని చెడిపోయిన పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ధైర్యం చెప్పారు. త్వరలోనే తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆ రైతు వెన్నుతట్టారు.



○ బాగోగులపై బాబు ఆరా ○ సాదక బాధకాలపై మాటామంతీ

## త్వరలో 'బెల్టు' తీస్తా...

అనంతరం కోయచలక నుంచి బయలుదేరి చిమ్మపుడి వెళుతుండగా మార్గంమధ్యలో చెట్టుకింద సేదతీరుతోన్న మహిళా కూలీలు సూరమ్మ, అచ్చమ్మ, సైదమ్మలు బాబు కంటపడ్డారు. వారి పక్కన కూర్చుని కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. 'కూలిరేట్లు పెంచాలయ్యా..' అంటూ వారు చంద్రబాబును వేడుకున్నారు. నాటుసారాను పూర్తిగా అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. 'సారా కారణంగా మా ఆయన ఆరోగ్యం చెడిపోయింది.. ఎకరం పొలం అమ్మినా ఆరోగ్యం కుదుట పడలేదు..' అంటూ ఓ మహిళ ఆవేదన చెందారు. తాగుబోతు తండ్రి కారణంగా బడికి వెళ్లలేని స్థితిలో ఉన్న ఓ బాలికతోనూ బాబు మాట్లాడారు. వైఎస్ ప్రభుత్వం బెల్టుషాపులు, నాటుసారా తయారీదారులకు కొమ్ము కాస్తోందని త్వరలోనే బెల్టుషాపులను నిరోధించి మీ ఆరోగ్యాన్ని కాపాడతామని బాబు వారితో చెప్పారు.

## పరిహారంతో ఆదుకుంటాం...

అదే విధంగా చిమ్మపుడి గ్రామంలో గొర్రెల కాపర్లతో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కృష్ణయ్య, జోగయ్య అనే కాపరులు ఇక్కడ గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. 'అక్కడి నుంచి రావడం దేనికి.. పదెకరాల భూమికి మీ స్వస్థలంలోనే ఇప్పించే ఏర్పాటు చేస్తా.. ఉంటారా..' అని బాబు వారిని అడిగారు. గొర్రెలు చనిపోతే ఈ ప్రభుత్వ పరిహారం ఇవ్వడం లేదని, తెదేపా అధికారంలోకి వస్తే తగిన పరిహారం ఇచ్చి కాపరులను ఆదుకుంటామని బాబు వారికి హామీ ఇచ్చారు.